ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

చిత్తూరు జిల్లా వార్తలు
బుధవారం 18 డిసెంబరు 2024

అలా రక్షించారు!

● నదిలో కొట్టుకుపోయిన వ్యక్తిని కాపాడిన పోలీసులు,యువత


చిట్టిబాబును మందలిస్తున్న పోలీసులు, అధికారులు


తాడు సాయంతో కొట్టుకుపోతున్న చిట్టిబాబును కాపాడుతున్న యువత

నగరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):నగరి సమీపంలోని కుశస్థలి నదిలో కొట్టుకుపోయిన తమిళనాడువాసిని స్థానిక యువతతో కలిసి పోలీసులు కాపాడారు. నగరి - కీళపట్టు మధ్య కుశస్థలీ నదిలో మంగళవారం నీటి ప్రవాహం ఉధ్రుతంగా ఉంది. ఇక్కడున్న వంతెనపై ఉన్న రోడ్డుపై నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రమాదమని తెలిసినా మధ్యాహ్నం సమయంలో తమిళనాడులోని కొళ్లత్తూరుకు చెందిన చిట్టిబాబు తన ద్విచక్ర వాహనంపై ఈ వంతెన దాటడానికి ప్రయత్నించాడు. కొంతసేపటికే నీటి ప్రవాహానికి నదిలోపడి కొట్టుకుపోయాడు. స్థానిక యువత గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అందరూ కలిసి తాడు సాయంతో అతడిని కాపాడారు. అనంతరం చిట్టిబాబును మరోసారి ఇలా చేయొద్దని నగరి సీఐ మహేశ్వర్, తహసీల్దారు రవికుమార్, ఎంపీడీవో సతీష్ మందలించి పంపారు.

జాతర సందడి


ఊరేగుతున్న బంగారమ్మ


కరవాలాలతో భక్తుల సందడి

వెదురుకుప్పం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో మంగళవారం గంగ జాతర సందడి నెలకొంది. బంగారమ్మ, గంగమ్మలను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. బంగారమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. బంగారమ్మను పురవీధుల్లో ఊరేగించగా, ఇంటింటా కర్పూర హారతులు పట్టారు. పలువురు భక్తులు వివిధరకాల వేషాలతో పురవీధుల్లో తిరిగారు. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప పర్యవేక్షణలో వంద మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పూడుపాముల విక్రేతల అరెస్టు

● గోప్యంగా ఉంచిన ఫారెస్ట్ విజిలెన్స్ అధికారులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పూడుపాముల విక్రయిస్తున్న ఐదుగురిని ఫారెస్టు విజిలెన్స్ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. నిందితుల్లో గుడిపాల, చిత్తూరు, దామలచెరువుకు చెందిన ఒక్కొక్కరు, పీలేరుకు చెందిన ఇద్దరు ముఠా ఏర్పడి పూడుపాములు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితులు చిత్తూరు కొంగారెడ్డిపల్లెలోని ఓ హోటల్‌లో ఉన్నట్లు మంగళవారం సమాచారం అందింది. పక్కా పథకంతో కొనుగోలుదారులుగా వెళ్లి విజిలెన్స్ అధికారులు చాకచక్యంగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారులు గోప్యంగా ఉంచారు. విచారణ తర్వాతే పూర్తి వివరాలు తెలియజేయనున్నట్లు తెలిసింది.


వివిధ బ్రాండ్ల పేరుతో తరలించేందుకు సిద్ధంగా రేషన్ బియ్యం

ఆర్డీవో కార్యాలయంలో

కుర్చీలాట

రెండున్నరేళ్లలో 9మంది బదిలీ

పరిష్కారమవని రెవెన్యూ సమస్యలు

పలమనేరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో తమ సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయని భావించిన పది మండలాల రైతులకు నిరాశే మిగులుతోంది. పలమనేరులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలన్న ప్రజల ఆకాంక్ష నెరవేరినా సంతోషం మిగలడంలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ నుంచి వేరుచేసి కుప్పం నియోజకవర్గ కేంద్రాన్ని కుప్పం రెవెన్యూ డివిజన్‌గా, పలమనేరు, గంగవరం బైరెడ్డిపల్లి, వి.కోట, పెద్దపంజాణి,పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, బంగారుపాళ్యం మండలాలతో పలమనేరు రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. 2022 ఏప్రిల్4న పలమనేరుతొలి ఆర్డీవోగా పద్మావతి బాధ్యతలు స్వీకరించారు. 18రోజులకే ఆమె బదిలీ అయ్యారు. దీంతో ఎఫ్ఏసీగా భవాని బాధ్యతలు స్వీకరించారు. ఆరురోజుల తరువాత ఆమె బదిలీ కావడంతో మళ్లీ పద్మావతి ఆర్డీవోగా వచ్చారు. ఆ ఏడాది జూన్20న ఆమె బదిలీ అయ్యాక ఎస్. శివయ్య ఎఫ్ఏసీగా బాధ్యతలు స్వీకరించారు. నవంబరు 2న శివయ్య కూడా బదిలీ కావడంతో జి.రామకృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నెలరోజులు తిరగక ముందే ఆయన కూడా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మళ్లీ ఎస్. శివయ్య వచ్చారు. గతేడాది అక్టోబరు20న శివయ్య బదిలీ కావడంతో ఎన్.మనోజ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. దాదాపు ఏడాది తరువాత సెప్టెంబరు 29న మనోజ్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీనివాసులురాజు వచ్చారు. నెల తిరగకముందే ఆయన బదిలీ కావడంతో గతంలో ఎఫ్ఏసీగా పనిచేసిన భవానీ మరోసారి ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇలా రెవెన్యూ డివిజన్ ఏర్పడిన రెండున్నరేళ్లలో ఎనిమిదిమంది బదిలీ అయ్యారు. వీరిలో నలుగురు నెల రోజులకే బదిలీ కాగా ఇద్దరు 11నెలలు పనిచేశారు. మరో ఇద్దరిలో ఒకరు ఆరు నెలలు, మరొకరు రెండు నెలలు పనిచేశారు. పదేపదే ఆర్డీవోలు బదిలీ అవుతుండడంతో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఇబ్బందులెదురవుతున్నాయి.





పలమనేరు ఆర్డీవో కార్యాలయం - రెండేళ్ల వ్యవధిలో పనిచేసిన ఆర్డీవోల జాబితా

పాతికేళ్ల యువకుడికి 50 ఏళ్ల వ్యక్తి గుండె

● పద్మావతి హృదయాలయంలో 17వ గుండె మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం


విమానం నుంచి అంబులెన్సులోకి గుండెను తీసుకొస్తున్న డాక్టర్లు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాకు చెందిన 25 ఏళ్ల యువకుడికి.. విశాఖకు చెందిన 50 ఏళ్ల మురళి గుండెను మంగళవారం తిరుపతిలోని పద్మావతి హృదయాలయంలో వైద్యులు అమర్చారు. గుండె మార్పిడి శస్త్రచికిత్స అవసరమైన ఈ యువకుడు ఆరు నెలల కిందట ఇక్కడి వైద్యులను సంప్రదించారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో యువకుడికి అన్ని పరీక్షలు నిర్వహించి అతడి వివరాలను జీవన్‌దాన్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఇక్కడ వైద్యం అందిస్తున్నారు. ఈ క్రమంలో విశాఖలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మురళికి బ్రెయిన్‌డెడ్ అయింది. అవయవదానానికి కుటుంబీకులు ముందుకు వచ్చారు. దీంతో మంగళవారం డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని కిమ్స్ ఆస్పత్రికి చేరుకొని ఉదయం 11 గంటల సమయంలో గుండె సేకరణను పూర్తి చేశారు. గ్రీన్‌ఛానల్ ద్వారా ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి.. అక్కడ్నుంచి ప్రత్యేక అంబులెన్సులో మధ్యాహ్నం 1.45 గంటలకు శ్రీపద్మావతి హృదయాలయానికి చేరుకున్నారు. దాదాపు 6 గంటల సేపు గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఇది 17వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స. ఆ యువకుడిని ప్రత్యేక ఐసీయూ వార్డులో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. మురళి కుటుంబ సభ్యులకు, గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసిన పోలీసులకు వైద్య బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

వైసీపీ నేత మిల్లులో పేదల బియ్యం!

● పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు స్మగ్లింగ్

కుప్పం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయినా వైసీపీ నేతల ఆగడాలు ఆగడంలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలోనే రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేస్తున్నారు. టన్నులకొద్దీ రేషన్ బియ్యాన్ని సొంత మిల్లులకు చేర్చి, పాలిష్ చేసి మరీ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కుప్పం మున్సిపాలిటీ బైరుగానిపల్లెవద్ద వున్న వైసీపీ నేత రైస్ మిల్లుపై మంగళవారం సాయంత్రం రెవెన్యూ, పోలీస్ అధికారులు జరిపిన దాడుల్లో ఏకంగా 5 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడడమే దీనికి నిదర్శనం. పలమనేరు నియోజకవర్గం వి.కోటకు చెందిన వైసీపీ నాయకుడు అండియప్పన్ బైరుగానిపల్లె వద్ద రైస్ మిల్లు నడుపుతున్నారు. ఇక్కడ అసలు వ్యాపారంకంటే రేషన్ బియ్యం పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు స్మగ్లింగ్ చేసే దందా ఎక్కువగా నడుస్తున్నదని ఎప్పటినుంచో ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈ దందా విచ్చలవిడిగా సాగుతుండగా ఒకటిరెండు సార్లు ఆండియప్ప రైస్‌మిల్లులో రేషన్ బియ్యం స్మగ్లింగ్ జరుగుతూ పట్టుబడింది కానీ, అధికారులు చర్యలు తీసుకోలేదు. టీడీపీ అధికారంలోకి వచ్చాక కూడా ఈ రైస్ మిల్లులో ఇదే దందా సాగుతున్నదని స్థానికులు చెబుతుంటారు. ఇక్కడ రేషన్ బియ్యం పాలిష్ చేసి, ఆనవాలు తెలియకుండా ఏదో ఒక బ్రాండ్ వేసి, ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది.తహసిల్దారు చిట్టిబాబు, సీఐ మల్లేశ్ యాదవ్, ఆర్ఐ వేణుగోపాల్ మంగళవారం సాయంత్రం సిబ్బందితో కలిసి ఆండియప్పన్ రైస్ మిల్లుపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 5,420 కిలోల రేషన్ బియ్యం పట్టుబడింది. ఇందులో సుమారు 750 కిలోల బియ్యాన్ని అప్పటికే పాలిష్ చేసి బ్యాగుల్లో ప్యాక్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించడానికి సిద్ధంగా ఉంచారు. మిగిలిన రేషన్ బియ్యం అలాగే మూటల్లో ఉంది. మిల్లు యజమాని లేరు కానీ, మిషన్ ఆపరేటర్ బాలాజీ పట్టుబడ్డాడు. రేషన్ బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు ఆపరేటర్ బాలాజీని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై తహసిల్దార్ చిట్టిబాబు, సీఐ మల్లేశ్ యాదవ్, ఆర్ ఐ వేణుగోపాల్ మాట్లాడుతూ ఆండియప్పన్ రైస్ మిల్లులో 5420 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడిందని చెప్పారు. బియ్యం సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.


రైస్‌మిల్లులో అధికారుల తనిఖీలు

రోడ్డు రోలర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● 40మందికి గాయాలు






దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు ముందుభాగం - డివైడర్‌పైకి ఎక్కిన రోడ్డురోలరు - రుయాలో క్షతగాత్రులకు చికిత్స

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లె జంక్షన్ వద్ద (పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి) మంగళవారం ఉదయం అతివేగంగా వచ్చిన చిత్తూరు-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు రోలరును ఢీకొంది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 50 మందిలో 39 మందితో పాటు రోడ్డురోలర్ డ్రైవరు కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు, పోలీసులు యుద్ధప్రాతిపదికన క్షతగాత్రులను 108 అంబులెన్సుల్లో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.వీరిలో కుమార్‌తో పాటు రమేష్, శరవణ, ధర్మ, హనుమంతప్ప పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉన్నట్లు పోలీసులు చెప్పారు.ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు ముందు భాగం దెబ్బతింది. రోడ్డు రోలరు జంక్షన్ పాయింట్ కట్ అయింది. దీంతో ఇంజన్ నుంచి వెనుక భాగం వేరై పక్కనే వున్న డివైడర్ పైకి ఎక్కింది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ తప్పిదమే ప్రధాన కారణంగా పోలీసులు భావించి కేసు నమోదు చేశారు. ఆర్టీసీ బస్సును సీజ్ చేశామని ఎస్ఐ రామకృష్ణ చెప్పారు. ఈ ప్రమాద ఘటనపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆరా తీశారు. గాయపడిన వారందరికీ మెరుగైన చికిత్సలు అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు.

యువతకు దంపతుల టోపీ

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తామని రూ.45లక్షల వసూలు

బంగారుపాళ్యం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని యువతకు టోపీ పెట్టారా దంపతులు. రూ.45 లక్షలు తీసుకుని ఉద్యోగాలు ఇప్పించకుండా మోసం చేశారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులను అరెస్టు చేశారు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిసిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలం ఎన్.కోటూరు గ్రామానికి చెందిన పావని, నందకుమార్ దంపతులు బెంగళూరులో నివాసం ఉంటున్నారు. ఓ పథకం ప్రకారం గంగవరం, యాదమరి, బంగారుపాళ్యం మండలాలకు చెందిన యువతకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించారు. తమ మాటలు నమ్మిని వారి వద్ద నుంచి సుమారు రూ.45లక్షలు వసూలు చేశారు. ఎంతకీ ఉద్యోగాలు ఇప్పించక పోవడంతో బాధితులు రెండు నెలల కిందటే పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు.. నిందితులైన దంపతులను అరెస్టు చేసి, మంగళవారం రిమాండ్‌కు తరలించారు.


నిందితుల వివరాలు తెలియజేస్తున్న సీఐ శ్రీనివాసులు

వణుకుతున్న తిరుపతి

మరో రెండు రోజులూ ఇలాగే

నేడు, రేపు భారీ వర్ష సూచన

తిరుపతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):తుపాను హెచ్చరికల నేపథ్యంలో తిరుపతి జిల్లాను చలిగాలులు ముట్టడించాయి. పగలు కూడా చీకటిగా మారి చలి వణికిస్తోంది. మంగళవారం కనిష్ఠ ఉష్ణోగ్రత 21 డిగ్రీలకు పడిపోయింది. పగటి సమయంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీలుగా నమోదైంది. ఫెంగల్ తుఫానుతో గత నెలాఖరులో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే. పది రోజుల తేడాతో మరో వాయుగుండం ఏర్పడి తుఫానుగా మారింది. అప్పుడు కూడా రెండు రోజుల పాటు భారీ వర్షాలు జిల్లాను ముంచెత్తాయి. ఇపుడు మళ్లీ వాయుగుండం ఏర్పడడంతో సోమవారం నుంచే జిల్లాలో మబ్బులు కమ్ముకున్నాయి. చలిగాలులు వీస్తున్నాయి.మంగళవారం తీవ్రత మరింత పెరిగింది. రానున్న రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు ఇదే విధంగా వుంటాయని వాతారణ శాఖ తెలియజేసింది. బుధవారం కనిష్ఠ ఉష్ణోగ్రత 22 డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రత 25 డిగ్రీలు వుంటుందని పేర్కొన్నారు. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో బుధ, గురువారాల్లో జిల్లావ్యాప్తంగా తేలికపాటి నుంచీ మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది.


తిరుమలలో యాత్రికుల తిప్పలు



మంగళవారం ఉదయం శుభ్రపరిచారిలా..

చెత్తతీసి.. కల్లాపు చల్లి!

అది తిరుపతి నగరం కొర్లగుంట జంక్షన్ నుంచి పాత కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి. ఇంటింటికీ చెత్త సేకరణ జరుగుతున్నా.. కొందరు స్థానికులు ఈ దారిలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మరు వద్ద చెత్త వేస్తున్నారు. ఎంత చెప్పినా ఎవరూ వినిపించుకోలేదు. చివరకు 'ఇచ్చట చెత్త వేయరాదు. వేసినచో రూ.1000 జరిమానా విధించబడును' అని కమిషనరు పేరిట హెచ్చరిస్తూ ఫ్లెక్సీ పెట్టారు. అయినా.. చెత్త వేయడం ఆపలేదు. చివరకు పారిశుధ్య సిబ్బంది వినూత్న ఆలోచనతో ముందుకొచ్చారు. మంగళవారం ఉదయానికంతా అక్కడ 'చెత్త'శుద్ధి చేశారు. పేడ నీటితో కల్లాపు చల్లారు. కుండీల్లో పూలమొక్కలు పెట్టారు. ఇలాగైతే స్థానికుల్లో మార్పు వచ్చి చెత్త వేయరన్న భావనతో ఈ పనులు చేశారు. పారిశుధ్య సిబ్బంది ఆశించిన ఈ మార్పు ప్రజల్లో వస్తే.. తిరుపతి స్వచ్ఛ నగరం అవుతుంది.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి

17 ఇసుక ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్



అక్రమంగా ఇసుక తరలిస్తున్నారంటూ మంగళవారం రెవెన్యూ అధికారులకు వచ్చిన ఫిర్యాదుపై దాడి చేశారు. పోలీసుల సహకారంతో 17 ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు ఆర్‌ఐ జైకృష్ణ తెలిపారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డికి అందిన ఫిర్యాదు మేరకు తాము పిల్లపాళ్యం స్వర్ణముఖినది సమీపంలోని ప్రైవేటు భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు నిర్వహించామన్నారు. ఇసుక తరలిస్తున్న 7 ట్రాక్టర్లు, పది ఖాళీ ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి గాజులమడ్యం పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. వీఆర్వో విశ్వనాథం ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి



సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమలలో స్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.36 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 62,112

తలనీలాలు సమర్పించినవారు: 22,541



మీ కళ్లెదుట ప్రమాదం జరిగిందా?

కాపాడినందుకు కోర్టుకు తిరగనవసరం లేదు


పోలీసులూ, ఆసుపత్రుల వేధింపులుండవు

కేంద్రం మార్గదర్శకాలు

తిరుపతి(నేరవిభాగం) ఆంధ్రజ్యోతి

రోడ్డు మీద ప్రమాదం జరుగుతుంది. రక్తగాయాల్లో చెల్లాచెదురుగా పడిపోయి ఉంటారు. ఆ దారినపోయేవారు కొందరు ఆగి చుట్టుముడుతారు. కొందరు దూరంగా ఉండి, వివరాలు కనుక్కుంటారు. మరికొందరు వెంటనే మొబైల్ బయటకు తీసి వీడియో తీస్తుంటారు. ఒకరో ఇద్దరో పూనుకుని 108కి ఫోన్ చేస్తారు.

.. రోడ్డు ప్రమాదాల సమయంలో సాధారణంగా కనిపించే దృశ్యం ఇది. గాయపడ్డవారిని తక్షణం తామే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం మాత్రం దాదాపుగా ఎవరూ చేయరు. నిజానికి రోడ్డు ప్రమాద సంఘటనల్లో గోల్డెన్ అవర్ కీలకమైనది. అంటే ప్రమాదం జరిగిన గంటలోగా ఆసుపత్రికి చేర్చగలిగితే మరణాలను నిరోధించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. తమ వాహనంలోనో లేదా ఆటోలోనో ఆసుపత్రికి తీసుకువెళ్లే సాహసం జనం చేయరు. అరుదుగా ఏ నాయకులో, అధికారులో చేసినపుడు ఇది వార్త అవుతుంటుంది.



ఎందుకిలా?

ఎందుకంటే మంచి చేసినా అది తమకు అంటుకుంటుందన్న భయం. సమీపంలో ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్తే, తీసుకువెళ్లిన వారి వివరాలు రాసుకుంటారు. ఆ తర్వాత పోలీసు వేధింపులు మొదలవుతాయి. సవాలక్ష ప్రశ్నలు ఎదురవుతాయి. సాక్ష్యంగా కోర్టుకు రమ్మంటారు. మానవత్వంతో చేసిన సాయానికి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉండాలా.. అన్న ఆందోళన వల్లే రోడ్డు ప్రమాద సంఘటనల్లో ప్రజల ఉదాసీనతకు కారణం. ఇటువంటి కారణాలను గుర్తించే కేంద్ర ప్రభుత్వం ఖచ్చితమైన మార్గదర్శకాలను జారీ చేసింది. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆ వివరాలను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలియజేశారు. రోడ్డు ప్రమాద బాధితులకు మానవతా దృక్పథంతో తక్షణం సాయం అందించండి అని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

కేంద్రం మార్గదర్శకాలు ఇవీ..

- ప్రమాద బాధితులకు సహాయకారిగా వచ్చిన వ్యక్తిని ఆసుపత్రి సిబ్బందిగానీ, పోలీసులుగానీ వేధించకూడదు. బాధితుడిని తక్షణం ఆసుపత్రిలో చేర్చుకుని వైద్య సేవలు అందించాలి.
- సాక్ష్యం చెప్పండి అంటూ బలవంతం చేయకూడదు.
- సాక్ష్యం చెబుతామని ముందుకు వచ్చిన వారి విచారణ ఒక్క రోజులోనే ముగించాలి. రెండవసారి పిలవకూడదు.

"రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసిన వ్యక్తులకు గౌరవ సూచకంగా రూ 5000 పారితోషికం జిల్లా కలెక్టర్ ఇస్తారు. వారి సేవలను గుర్తిస్తూ యోగ్యతా పత్రం కూడా అందిస్తారు.



రాగిమాను వద్ద పెద్ద మర్యాద స్వాగత సత్కారాలు అందుకుంటున్న పెద్ద జీయర్ స్వామి

పెద్దజీయర్ స్వామికి తిరునక్షత్ర మర్యాద

తిరుమల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): పెరియ కోయిల్ కేల్వి అప్పన్ శఠగోప రామానుజ పెద్దజీయర్ స్వామి 75వ జన్మదినం సందర్భంగా మంగళవారం పెద్దజీయర్ స్వామికి ఆలయంలో తిరునక్షత్ర మర్యాద జరిగింది. రాగిమాను వద్ద ఇస్తికఫాల్ స్వాగతం లభించింది. మేళతాళాల మధ్య చిన్నజీయర్ స్వామితో కలిసి ఆయన ఆలయం వద్దకు చేరుకున్నారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ మహాద్వారం వద్ద స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎల్లా



ప్రీతి నిగమ్, నగేస్ కర్రా - ఎల్లా వెంకటేశ్వర్లు

తిరుమల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. జనసేన పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బొలిశెట్టి సత్యనారాయణ, సినీనటి ప్రీతి నిగమ్, నగేష్ కర్రా దంపతులు, ప్రముఖ మృదంగ వాయిద్య కళాకారుడు ఎల్లా వెంకటేశ్వర్లు ఉన్నారు.

అ'దృశ్యం'

- భర్త కనబడలేదంటూ పోలీసులను ఆశ్రయించిన భార్య
- దర్యాప్తులో తీగ లాగితే డొంక కదిలిన వైనం
- వీడిన మర్డర్ మిస్టరీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నేరాలు, చోరీలు చేసి తాత్కాలికంగా కప్పిపుచ్చుకున్నా దొరికిపోక తప్పదు. అలా ఎలక్ట్రీషియన్ హత్య బయట పడటానికి 50 రోజులు పట్టింది. అదృశ్యం కేసుపై విచారణ చేపడితే హత్య విషయం వెలుగులోకి వచ్చింది. మర్డర్ మిస్టరీ కూడా వీడింది. శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐ గోపి తెలిపిన ప్రకారం.. ఏర్పేడు మండలం పల్లం గొల్లపల్లికి చెందిన వెంకటేష్, వసంత దంపతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేటలో కాపురం ఉంటూ స్వగ్రామానికి వెళి వ్యవసాయ పనులు చేసుకుని వచ్చేవారు. అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు చెందిన ప్రభాకర్ పదేళ్ల కిందట ఎలక్ట్రీషియన్ పనుల కోసం శ్రీకాళహస్తికి వచ్చాడు. కొత్తపేటలోనే ఓ మిత్రుడితో కలిసి అద్దె గదిలో ఉంటున్నాడు. ఖాళీ రోజుల్లో ఇంటికి వెళ్లి వస్తుండేవాడు. ఈ క్రమంలో వెంకటేష్ కుటుంబంతో ఇతడికి సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. వసంతతో చనువుగా మెలిగేవాడు. ప్రభాకర్, అతడి తరపు బంధువులు పలుమార్లు ఇద్దరిని మందలించినా మార్పు రాలేదు. దీని వల్ల వెంకటేష్, వసంత మధ్య విబేధాలు తలెత్తాయి. నాలుగు నెలల కిందట గొడవ జరగడంతో వెంకటేష్ స్వగ్రామానికి వెళ్లిపోయాడు. వసంత మాత్రం శ్రీకాళహస్తిలోనే ఉన్నారు. ఎలక్ట్రీషియన్ ప్రభాకర్ కారణంగా తన భార్య దూరమైందని వెంకటేష్ ఆగ్రహం పెంచుకున్నాడు. తన భార్య సోదరుడైన ఆటో డ్రైవర్ సుబ్రహ్మణ్యం, అల్లుడు హేమంత్‌కుమార్‌తో కలిసి అతడి అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు. అక్టోబరు 24న ముగ్గురు కలిసి మద్యం తాగేందుకు రావాలంటూ శ్రీకాళహస్తిలో కొత్తపేట వద్ద ఎలక్ట్రీషియన్ ప్రభాకర్‌ను ఆటో ఎక్కించుకున్నారు. నలుగురూ మద్యం తాగారు. ఆటోలో పల్లం గొల్లపల్లి శివారులోని శ్మశానం సమీపంలోకి వచ్చేసరికి ప్రభాకర్.. నిద్రలోకి జారుకున్నాడు. ముగ్గురూ కలిసి బండరాయితో అతడి తలపై కొట్టి హత్య చేశారు. కాలువ పక్కన మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. నాలుగు రోజులైనా ప్రభాకర్ రాకపోవడంతో.. అద్దె గదిలో ఉండే మిత్రుడు ఆయన భార్యకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. తన భర్త ప్రభాకర్‌కోసం సుధ పలుచోట్ల ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో నవంబరు 25న శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వసంతతో సన్నిహితంగా మెలిగేవాడన్న విషయాన్ని గుర్తించారు. ఆ తరువాత లోతుగా కూపీ లాగడంతో ఆమె భర్త, సోదరుడు, అల్లుడు కలిసి ప్రభాకర్‌ను చంపినట్లు నిర్ధారించారు. ఈ మేరకు మంగళవారం ఘటనా స్థలానికి చేరుకుని ప్రభాకర్ అవశేషాలను వెలికి తీసి.. అక్కడే ప్రభుత్వ వైద్యాధికారులతో పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, ముగ్గురు నిందితులు ఓ రెవెన్యూ అధికారి వద్ద లొంగిపోయినట్లు తెలిసింది. మొత్తమ్మీద అ'దృశ్యం' కేసులో దర్యాప్తు చేపడితే మర్డర్ మిస్టరీ వీడింది. సినిమా తరహాలో మృతదేహాన్ని పాతిపెట్టడం చర్చనీయాంశంగా మారింది.



మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యులు -ప్రభాకర్ (ఫైల్ ఫొటో)

విష జ్వరంతో విద్యార్థి మృతి

- పూడి వంతెన కొట్టుకుపోవడంతో ఇంట్లోనే చికిత్స
- ఆరోగ్యం విషమించి అసువులుబాసిన ఉదయ్



ఉదయ్‌కుమార్ (పాతచిత్రం)

కేవీబీపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం పూడి సీకేపురం గ్రామానికి చెందిన విద్యార్థి విష జ్వరంతో మృతి చెందాడు. చిట్టిబాబు, హేమలత దంపతుల రెండో కుమారుడు ఉదయ్‌కుమార్(14) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామం వద్ద కాజ్‌వే కొట్టుకుపోయింది. దీంతో ఇంటి వద్దే అందుబాటులో ఉన్న మందులతో సరిపెట్టారు. శనివారం జ్వరం ఎక్కువ కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్దామని బయలు దేరారు. యేరు ఉధృతంగా పారుతుండడంతో వెనుదిరిగారు. ఆదివారం తాత్కాలికంగా వంతెన పునరుద్ధరించడంతో కేవీబీపురం పీహెచ్‌సీకి తీసుకెళ్లి పరీక్షల అనంతరం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. తిరుపతిలో వైద్యం పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఉదయ్‌కుమార్ రాగిగుంట పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

- రూ.6 లక్షల జరిమానా

మంగళం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటూ ఒక్కొక్కరికి రూ.6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు తిరుపతి న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పునిచ్చినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రకారం వివరాలిలా ఉన్నాయి. తిరుపతి అటవీరేంజ్‌లోని తిమ్మినాయుడుపాలెం బీట్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతూ పూతలపట్టుకు చెందిన పులికంటి శ్రీరాములు, తిరుపతి రూరల్ మండలం తిరుచానూరుకు చెందిన దాసరి రమణయ్యపై టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో నిందితులకు ఐదేళ్ల జైలుశిక్షతో పాటూ ఒక్కొక్కరికి రూ.6 లక్షల జరిమానా విధించారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారికి ఈ తీర్పు గుణపాఠంగా నిలుస్తుందని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడే వారికి ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా జీవితకాలం వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. శిక్షపడ్డ ఇద్దరినీ నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

నకిలీ గుర్తింపు కార్డులు తయారు చేస్తే పదేళ్ల జైలు శిక్ష

తిరుమల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం నకిలీ గుర్తింపు కార్డులు తీసుకొచ్చినా.. గుర్తింపు కార్డుల్లో కేడర్ మార్చినా, ఒకరి స్థానంలో మరొకరు వచ్చినా పదేళ్ల జైలు శిక్ష పడుతుందని తిరుమల పోలీసులు మంగళవారం ఓ ప్రకటన ద్వారా హెచ్చరించారు. కన్నియకుమారికి చెందిన రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ విశ్వేశ్వరప్రసాద్ ప్రస్తుతం సౌత్‌జోన్ మిలటరీ క్యాంటీన్లకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈయన స్వామి దర్శనం కోసం కొందరిని సంప్రదించగా.. ఇతడి గుర్తింపుకార్డును వీరు బ్రిగేడియర్ అధికారిగా నకిలీది సృష్టించి బ్రేక్ దర్శన టికెట్లను పొంది విక్రయించారు. ఈఅక్రమాన్ని సోమవారం గుర్తించిన విజిలెన్స్ అధికారులు వన్‌టౌన్ పోలీసులకు అప్పగించగా వారు కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఈ ప్రకటన విడుదల చేశారు.

రూ.3.5 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

- గుజరాత్‌లో గోడౌన్లపై దాడి చేసి పట్టుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు
- ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్



పట్టుబడ్డ ఎర్రచందనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి సుబ్బరాయుడు

మంగళం, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం పటాన్‌లోని గోడౌన్లపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి రూ.3.5 కోట్ల విలువైన 155 ఎర్రచందనం దుంగలను పట్టుకున్నారు. ముగ్గురు ప్రధాన స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఈ దుంగలను తిరుపతికి తీసుకొచ్చారు. కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి జిల్లా ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఎల్.సుబ్బరాయుడు మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. 'కొద్ది రోజుల కిందట అన్నమయ్య జిల్లా సానిపాయ వద్ద రాంప్రసాద్, రవిశంకర్ అనే స్మగ్లర్లను అరెస్ట్ చేశాం. వీరిని విచారించగా గుజరాత్‌కు చెందిన స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. వారి సమాచారంతో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ ఎండీ షరీఫ్ బృందం, గుజరాత్ పోలీసుల సహకారంతో పటాన్‌లోని గోడౌన్లపై దాడిచేశారు. అంతరాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్లయిన గుజరాత్‌లోని దీసా పట్టణానికి చెందిన ఉత్తమ్‌కుమార్ నందకిషోర్‌సోనీ, జోషి హన్స్‌రాజ్, పఠాన్ పట్టణానికి చెందిన పరేష్ జి కాంతిఠాకూర్‌ను అరెస్ట్ చేశాం. వీరు గోడౌన్లలో దాచి ఉంచిన ఐదు టన్నుల బరువైన 155 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నాం. ఒక కారుని సీజ్ చేశాం' అని టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి సుబ్బరాయుడు తెలిపారు. పట్టుబడ్డ వారిని అక్కడి కోర్టులో ప్రవేశపెట్టి ట్రాన్సిట్ వారెంట్‌పై తిరుపతికి తీసుకొచ్చామన్నారు. ప్రధాన స్మగ్లర్లను అరెస్ట్ చేసేందుకు దర్యాప్తు కొనసాగుతుందని, అవసరమైతే పట్టుబడ్డ వారిపై పీడీ, ఏసీటీ యాక్టులు ప్రయోగిస్తామన్నారు. ఈ ఆపరేషన్‌లో ప్రతిభ కనబరచిన టాస్క్‌ఫోర్స్ అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించి నగదు బహుమతి అందించారు. ఈ విలేకరుల సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు జి.బాలిరెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్, ఆర్‌ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎం.సురేష్‌కుమార్, ఎస్‌ఐ రఫీ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే హైవే భూసేకరణ వేగవంతం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వేప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి పనుల పురోగతిపై జేసీ శుభంబన్సల్‌తో కలిసి వర్చువల్ విధానంలో అధికారులతో సమీక్షించారు. భూసేకరణలో వచ్చే సమస్యలను ఎప్పటికపుడు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఎన్‌హెచ్‌ఏఐ పీడీలు, గూడూరు సబ్‌కలెక్టరు రాఘవేంద్ర మీనా, ఆర్డీవోలు రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, సంబంధిత మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ టెక్నీషియన్ నెట్‌వర్కింగ్ అండ్ స్టోరేజ్‌పై నైపుణ్య శిక్షణ

తిరుపతి(విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ నిర్వహిస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్వి కాస్యోజన (పీఎంకేవీవై)4.0 ద్వారా జిల్లాలో నిరుద్యోగ యువతకు పరిశ్రమలకు కావల్సిన నైపుణ్యాలకు అనుగుణంగా స్కిల్‌హబ్‌లలో శిక్షణ, ఉపాధి అవకాశాలను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కల్పిస్తోందని తెలిపారు. జిల్లాకు చెందిన స్కిల్‌హబ్ ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో 'అసిస్టెంట్ టెక్నీషియన్ - నెట్‌వర్కింగ్ అండ్ స్టోరేజీ' కోర్సుకు సంబంధించి శిక్షణ ప్రారంభించినట్టు వెల్లడించారు. 210 గంటల కాలవ్యవధి కలిగిన ఈ కోర్సుకు 10వ తరగతి, ఆపైన విద్యార్హతలు కలిగివారు అర్హులన్నారు. 81435 76866, 99851 29995 నంబర్లలో సంప్రదించాలని, అలాగే, forms.gle/XeQyn5D7DUWHd3sd6 లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

బ్యాంకులో దోపిడీకి యత్నం

- యువకుడిని పట్టుకుని చితకబాదిన ఖాతాదారులు



రేణిగుంట డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో దోపిడీకి యత్నించిన యువకుడిని స్థానికులు పట్టుకుని కట్టేసి చితకబాదారు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం తిరుపతి- రేణిగుంట రోడ్డులోని ఇండియన్ బ్యాంకులో జరిగింది. కృష్ణతేజ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న ఈ బ్యాంకులోకి సాయంత్రం మూసివేసే సమయంలో ఓ యువకుడు ముఖానికి కర్చీఫ్ కట్టుకుని, బ్యాగులో కత్తిని పెట్టుకుని ప్రవేశించాడు. క్యాషియర్ పక్కన ఉన్న అకౌంటెంట్ మెడపై కత్తి పెట్టి డబ్బులు బ్యాగులో వేయాలని బెదిరించాడు. అదే సమయంలో బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులు ఆ యువకుడిని మాటల్లో దింపి చాకచక్యంగా పట్టుకున్నారు. బయటకు తీసుకొచ్చి గ్రిల్‌కు కట్టేసి చితకబాదారు. తాను రూ.5 లక్షల అప్పుల పాలయ్యానని, ఆ బాధ తట్టుకోలేక చోరీకి వచ్చినట్టు అతడు చెప్పాడు. తాను లక్ష్మీపురం సర్కిల్‌లో ఉంటానని, శ్రీకాళహస్తి ఆలయం సమీపంలో ఇల్లు ఉందని, డిగ్రీ వరకు చదువుకున్నానని చెప్పాడు. తిరుచానూరు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, ఆ యువకుడి పేరు పురుషోత్తం అని పోలీసుల విచారణలో తేలింది. వరదయ్యపాలెం మండలం సదనవారిపల్లెకు చెందిన వాడని పోలీసులు తెలిపారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేసే ఇతడిని.. ఆర్థిక వ్యవహారాల్లో ఉద్యోగం నుంచి తొలగించారు. బ్యాంకు అప్రైజరును బెదిరించిన కేసులో పురుషోత్తంను అరెస్టు చేశారు. గతంలో ఇతడిపై ఎటువంటి నేరచరిత్ర లేదని సీఐ సునీల్‌కుమార్ వెల్లడించారు.

షార్‌లో ఆక్టోపస్ బృందం



ఆక్టోపస్ బృందంతో తహసీల్దార్ నరసింహరావు, ఎస్‌ఐ శ్రీకాంత్

సూళ్లూరుపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌కు మంగళవారం ఆక్టోపస్ బృందం చేరుకుంది. డీఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో 52మంది ఆక్టోపస్ సిబ్బంది షార్ పరిధిలో ఉన్న సముద్ర మార్గంతో పాటు ఇతర ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు.తీవ్రవాదులు షార్‌లోకి ప్రవేశించినప్పుడు,సముద్ర మార్గం గుండా చొరబాటుదారులు వచ్చినప్పుడు ఏ విధంగా ఎదుర్కోవాలో ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహించనుంది. ఆక్టోపస్ బృందానికి తహశీల్దార్ ఎస్‌వి.నరసింహరావు, శ్రీహరికోట ఎస్‌ఐ శ్రీకాంత్ స్వాగతం పలికారు.

'వైష్ణవి'కి కార్మికుల కాపలా

- మద్దతు తెలిపిన టీడీపీ నేతలు

పెళ్లకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైష్ణవి డెయిరీని యాజమాన్యం వదిలేసి వెళ్లడంతో కార్మికులు, ఉద్యోగులు షిఫ్టుల విధానంలో కాపలా కాస్తున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదానికి వాడే నెయ్యి కల్తీ చేశారనే కేసులో సిట్ బృందం ఇక్కడకు వచ్చి విచారించడం.. ఉద్యోగులను, కార్మికులను వదిలి యాజమాన్యం వెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం కంపెనీ వద్దకు కార్మికులు, ఉద్యోగులు వెళ్లగా.. సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. దీంతో పరిశ్రమకు కాపలా ఉండి ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని భావించిన కార్మికులు రెండు షిఫ్టులుగా అక్కడ ఉంటున్నారు. స్థానిక టీడీపీ నాయకులు వేలూరు హరినాయుడు, తాళ్ల యుగందర్‌గౌడ్ మంగళవారం వీరికి మద్దతు తెలిపారు. కాగా, సోమవారం యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు తన సిబ్బందితో కలసి కంపెనీని సందర్శించి.. పరిశీలించారు.



కార్మికులకు మద్దతు తెలుపుతున్న టీడీపీ నేతలు

పది నెలల బాలుడి గొంతులో ఇరుక్కున్న బ్యాటరీ

- స్విమ్స్‌లో శస్త్ర చికిత్సతో తొలగింపు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రిమోట్‌లకు ఉపయోగించే బ్యాటరీతో పది నెలల బాలుడు ఆడుకుంటూ మింగడంతో గొంతులో ఇరుక్కుపోయింది. స్విమ్స్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం ఆధ్వర్యంలో అతిక్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి బ్యాటరీని తొలగించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మంగళవారం తెలిపారు. శ్రీకాళహస్తికి చెందిన ఈ బాలుడిని కుటుంబ సభ్యులు స్విమ్స్‌కు తీసుకొచ్చారన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ శివరామకృష్ణ ఆధ్వర్యంలో వైద్యుల పర్యవేక్షణలో అధునాతన వైద్య పరిజ్ఞానంతో బాలుడికి శస్త్ర చికిత్స చేశామన్నారు. అనంతరం బాలుడు పూర్తి ఆరోగ్యంగా కోలుకోవడంతో మంగళవారం బాలుడ్ని డిశ్చార్జి చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటరామిరెడ్డి, చంద్రమౌళీశ్వరన్, మనోజ్‌కృష్ణ, తేజస్విని, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు 988 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం 53 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, 988 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. భూ ఆక్రమణలపై 29, ఇళ్ల స్థలాలపై 124, అసైన్‌మెంట్ భూములపై 83, క్యాస్ట్ వెరిఫికేషన్ 15, రీసర్వే 21, ల్యాండ్ గ్రాబింగ్ 2, ఆర్‌వోఆర్‌పై 473, ఇతర విషయాలకు సంబంధించి 167 వచ్చాయన్నారు. వాటిలో 15 అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు.







ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న నిర్మల్ కుమార్‌ప్రియ - వాలీబాల్ ఆడుతున్న విద్యార్థినులు - వాలీబాల్ విన్నర్స్, రన్నర్స్‌తో అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్లు

పలమనేరులో క్రీడా సందడి

ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ప్రారంభం

పలమనేరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా పాలిటెక్నిక్‌లో రెండు రోజుల పాటు జరిగే ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ బాలికల రీజినల్ మీట్ మంగళవారం ప్రారంభమైంది. ఎస్వీయూ రీజియన్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆర్డేడీ నిర్మల్‌కుమార్‌ప్రియ దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీల్లో 7 ప్రభుత్వ, 16 ప్రైవేటు పాలిటెక్నిక్ విద్యార్థినులు పాల్గొంటున్నారన్నారు.ఈ పోటీలు బుధవారం కూడా జరుగుతాయని, గెలుపొందిన విద్యార్థినులు విశాఖలో జరిగే రాష్ట్రపోటీల్లో పాల్గొంటారన్నారు.

తొలిరోజు విజేతలు

వాలీబాల్‌లో పలమనేరు పాలిటెక్నిక్ విద్యార్థినులు విన్నర్స్ కాగా తిరుపతిలోని పద్మావతీ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులు రన్నర్స్‌గా నిలిచారు. టేబుల్‌టెన్నిస్ సింగిల్స్‌లో పద్మావతి మహిళా పాలిటెక్నిక్ విద్యార్థిని జి.రమ్య, డబుల్స్‌లో అదే కళాశాల విద్యార్థినులు జి.రమ్య, జె. చరితారెడ్డి, లాంగ్‌జంప్,ట్రిపుల్ జంప్ విభాగంలో చంద్రగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థిని షణ్ముఖప్రియ, షాట్‌పుట్‌లో కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థిని ఇందుప్రియ విజేతలుగా నిలిచారు. పలమనేరు, గంగవరం మండలాల ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు ఈ పోటీలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్‌తోపాటు కదిరి పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కె.రమ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



టేబుల్ టెన్నిస్ విన్నర్స్, రన్నర్స్

విద్యార్థుల మానసిక స్థితి మెరుగుపడాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మురళీధర్ తదితరులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మానసిక స్థితి మెరుగుపడాలని, అప్పుడే ఏకాగ్రత వస్తుందని ఎస్వీయూ ప్రొఫెసర్ మురళీధర్ అన్నారు. ఎస్వీయూ రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం పూర్వ విద్యార్థి, వి.కోట జడ్పీ ఉన్నత పాఠశాల(బాలుర)లో స్కూల్ అసిస్టెంట్ (సోషియల్)గా పనిచేస్తున్న డాక్టర్ కణ్ణన్.. 'చిత్తూరు జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థుల మానసిక ఆరోగ్య స్థితిపై విశ్లేషణాత్మక అధ్యయనం'పై రచించిన పుస్తకాన్ని పలువురు ప్రొఫెసర్లతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఇలాంటి విశ్లేషణాత్మక రచనలు భవిష్యత్తు తరాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. ప్రొఫెసర్లు మత్తయ్యన్, పద్మనాభం, విజయకుమార్, నాగరత్నం, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

మండలాలకు పశువుల మందుల సరఫరా



మందులు అందజేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేసే పశువుల మందులను సద్వినియోగం చేసేలా చర్యలు చేపట్టాలని పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ జిల్లా స్టోర్ నుంచి పశువుల మందులను మంగళవారం మండలాలకు పంపించారు. చలికాలంలో పశువులకు ఎలాంటి రోగాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా పాడి రైతులకు సూచించాలని మండల పశువైద్యాధికారులను ఆదేశించారు. ఒక్కో మండలానికి రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు విలువ చేసే మందులు సరఫరా చేశారు.

చిత్తూరు హైరోడ్డులో వేగంగా ఆక్రమణల తొలగింపు



కోర్టు వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

చిత్తూరు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు హైరోడ్డులో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం వేగంగా జరుగుతోంది. ఇప్పటికే మార్కింగ్ పూర్తి చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు. జిల్లా కోర్టు సముదాయం నుంచి పీసీఆర్ పాఠశాల వరకు వరకు ఉన్న దిమ్మెలు, బంకులు, ఇతర వాటిని మంగళవారం తొలగించారు. బుధవారం కూడా ఆక్రమణలను తొలగించే కార్యక్రమాన్ని చేపడతామని ఏసీపీ నాగేంద్ర తెలిపారు.

క్రీడాకారిణికి శాప్ చైర్మన్ అభినందన



రమ్యను సన్మానించిన శాప్ చైర్మన్ రవినాయుడు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లోనూ రాణించేలా పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని శాప్ చైర్మన్ రవినాయుడు సూచించారు. చిత్తూరుకు చెందిన స్కేటర్ రమ్య తిరుపతిలోని శాప్ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్‌ను మంగళవారం కలిశారు. ఈమె ఈనెల 5 నుంచి 15వ తేదీవరకు మైసూరులో జరిగిన 62వ నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిథ్యం వహించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు చైర్మన్ తెలిపారు. రమ్యకు శాప్ నుంచి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

టెన్త్ నామినల్ రోల్స్‌లో సవరణలకు రేపటినుంచి అవకాశం : డీఈవో

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నుంచి టెన్త్ నామినల్ రోల్స్‌లో సవరణలకు అవకాశం కల్పిస్తున్నట్లు డీఈవో వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మార్చిలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా టెన్త్ నామినల్‌లో విద్యార్థుల వివరాలు సవరణ చేయడానికి హెచ్ఎంల లాగిన్‌లో ఎడిట్ ఆప్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈనెల 23వ తేదీ వరకు ఈఅవకాశం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపట్నుంచే నారా భువనేశ్వరి పర్యటన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి మూడునెలలకోసారి నియోజకవర్గంలో పర్యటిస్తున్నారని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, ఇతర టీడీపీ నాయకులు అన్నారు. ఆమె ఈనెల 19 నుంచి 22 వరకూ నియోజకవర్గంలోని పర్యటిస్తారన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భువనేశ్వరి పర్యటన షెడ్యూల్‌ను విడుదల చేశారు. 18వ తేదీ రాత్రి కుప్పంలోని పీఈఎస్ గెస్ట్ హౌస్‌కు చేరుకుని మర్నాడు ఉదయం 9 గంటలకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. తర్వాత శాంతిపురం మండలం కడపల్లె వద్ద సొంత ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తారు. ఉదయం 11 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటలదాకా శాంతిపురం మండలం నలగాంపల్లెలో గ్రామీణులతో మమేకమవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు కుప్పం చేరుకుని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ విస్తరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. 3.45 గంటలకు ఎన్టీఆర్ ట్రస్టు తరఫున చిరు వ్యాపారులకు తోపుడు బళ్లు, మహిళలకు కుట్టు మిషన్లు, దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ చేస్తారు. సాయంత్రం 4.45 గంటలకు డీఎస్సీ కోచింగ్ విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొంటారు. సాయంత్రం 6 నుంచి 7 గంటలదాకా టీడీపీ ముఖ్య నేతలతో సమావేశమవుతారు. 20వతేదీ ఉదయం వినతులు స్వీకరించాక 10 గంటలకు కుప్పం మండలం వెండుగంపల్లె వెళ్లి మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.15 గంటలకు అడవిబూదుగూరులో మహిళలతో సమావేశమవుతారు. 2.30 గంటలకు కొట్టాలూరు పంచాయతీ గుండ్లమడుగులో మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు ప్రత్యంగ ఆలయంలో వెండి కిరీటం సమర్పిస్తారు. సాయంత్రం 6 గంటలకు డీకే.పల్లె మహిళలతో సమావేశమవుతారు. సమావేశంలో టీడీపీ నాయకులు రాజ్‌కుమార్, వైద్యం శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాల నమోదు శిబిరాలు ప్రారంభం

సద్వినియోగం చేసుకోవాలన్న కలెక్టర్



శిబిరంలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులకు అవసరమైన ఉపకరణాల నమోదుకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మంగళవారం పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన శిబిరాన్ని ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. శిబిరాలను కాన్పూర్‌కు చెందిన సంస్థ నిర్వహిస్తోందన్నారు. బుధవారం ఎస్ఆర్‌పురం జడ్పీ హైస్కూల్‌లో, 19న పూతలపట్టు జడ్పీ హైస్కూల్‌లో, 20న నగరి పీసీఎన్ ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో, 21న పుంగనూరులో బీఆర్ ప్రభుత్వ హైస్కూల్‌లో, 22న పలమనేరు జడ్పీ హైస్కూల్‌లో, 23న కుప్పంలోని రాజావారి పార్కు వద్ద, 24న రామకుప్పం హైస్కూల్‌లో శిబిరాలు జరుగుతాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చేతి, చంక కర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రం, బ్యాటరీ ట్రైసైకిల్, వాయిస్ ఫోన్ తదితర ఉపకరణాలను అందిస్తామన్నారు. వయో వృద్ధుల సంక్షేమశాఖ ఏడీ శ్రీనివాస్, మేయర్ అముద, డీఆర్వో మోహన్‌కుమార్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

డ్రైవర్, క్లీనర్ దుర్మరణం





లారీ క్లీనర్, డ్రైవర్ మృతదేహాలు



ముందుభాగం నుజ్జయిన లారీ

పూతలపట్టు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుకవైపు నుంచి మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నుంచి తిరుపతి వైపు బయల్దేరిన లారీకి పూతలపట్టు మండలం పి.కొత్తకోట సమీపానికి వచ్చేసరికి టైరు పంక్చర్ అయ్యింది. దీంతో ఆ లారీని డ్రైవర్ రోడ్డుపక్కగా ఆపారు. పలమనేరు సమీపాన ఉన్న ఎర్రమిట్ట గ్రామానికి చెందిన లారీ క్లీనర్ కృష్ణమూర్తి (30) పంక్చర్ వేయడానికి టైరును విప్పుతున్నాడు. ఈ సమయంలో చిత్తూరు నుంచి వస్తున్న మరో లారీ.. వెనుకవైపు నుంచి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో పంక్చర్ వేస్తున్న క్లీనర్‌పైకి టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే వెనుక నుంచి ఢీకొన్న లారీలోని డ్రైవర్, ఒంగోలుకు చెందిన సిలార్ (50) కూడా తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ తమ సిబ్బందితో వచ్చి మృతదేహాలను పంచనామా నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయోధ్యకు పవన్ అభిమాని సైకిల్ యాత్ర



పెంటారావును సత్కరిస్తున్న నరేశ్ తదితరులు

కుప్పం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అభిమాని అయోధ్యకు సైకిల్ యాత్ర చేపట్టారు. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం పొట్టిదొర పాలేనికి చెందిన కొలిమల్ల పెంటారావు చాలాకాలంగా పవన్‌కు వీరాభిమాని. పవన్ డిప్యూటీ సీఎం కావడంతో ఇతడు అయోధ్య వెళ్లి రాముడిని దర్శించుకుంటానని మొక్కుకున్నాడు. ఈక్రమంలో తిరుమల శ్రీవారిని దర్శించుకుని, పవన్ కళ్యాణ్‌ను కలిసి సొంత గ్రామం చేరాలనుకున్నాడు. మూగవాడయిన పెంటారావు ఈ ప్రయాణంలో మంగళవారం కుప్పం చేరుకున్నాడు. నియోజకవర్గ జనసేన కో ఆర్డినేటర్ నరేశ్, నాయకులు వేణు, హరి, విజయ్, శ్రవణ్‌లు ఇతనికి సాదర స్వాగతం పలికారు. ఈ సైకిల్ యాత్రికునికి అవసరమైన ఆహారం, ఇతర నిత్యావసర వస్తువులు, బ్యాగు తదితరాలను సమకూర్చారు. సత్కరించి సాదరంగా సాగనంపారు.

పంటపొలాల్లో ఏనుగుల స్వైరవిహారం





ఏనుగుల దాడులతో దెబ్బ తిన్న పంటలు

సోమల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆవులపల్లె పంచాయతీలోని వంగసానివారిపల్లె, రాంపల్లెబీట్, ఇర్లపల్లె పొలాలను సోమవారం రాత్రి మూడు ఏనుగులు ధ్వంసం చేశాయి. టమోటా, మామిడి తోటలను నాశనం చేశాయని రైతులు వాపోతున్నారు. రెండు రోజులుగా ఏనుగులు సంచరిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న రైతులు టమోటా కోతలను ఆపేశారు. శనివారం రాత్రి కొత్తూరు సమీపంలో ఒంటరి ఏనుగు ప్రవేశించింది. ఆదివారం మరో రెండు చేరుకున్నాయి. వరి పంటను తొక్కి కోతలు చేసేందుకు వీలు లేకుండా నష్టపరిచాయి. మామిడి తోటల్లో ఏనుగులు సంచరించాయి. నిల్వ చేసిన ధాన్యాన్నీ తొక్కివేశాయి. వరి, మామిడి, అరటి తోటల్లో బీభత్సం సృష్టించాయని, డ్రిప్‌పైపులను నాశనం చేశాయని బాధిత రైతులు చెప్పారు. రాత్రిపూట పొలాల వైపు వెళ్లడానికి రైతులు భయపడుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

విస్తృతంగా 'ఆయుష్మాన్ భారత్' సేవలు

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ సేవలు మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు ఢిల్లీ నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయుష్మాన్ భారత్ మిషన్‌పై తాను రాసిన లేఖకు కేంద్రమంత్రి ప్రతాప్‌రావు జాదవ్ జవాబు ఇచ్చినట్లు తెలియజేశారు. చిత్తూరు జిల్లాలో 33,87,064 మంది, తిరుపతి జిల్లాలో 5,82,573 మంది ఆయుష్మాన్ భారత్ డిజిటల్ సేవలు పొందుతున్నట్లు తెలియజేశారని వివరించారు. ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించాలన్న లక్ష్యంతో భారత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించదని పేర్కొన్నారన్నారు. ఇందులో భాగంగా ఏపీపై ప్రత్యేక సారించిందని ఆ లేఖలో తెలియజేశారన్నారు.

డీకేటీ భూములను ఎలా విక్రయిస్తారు: జేసీ



రఘునాథపురంలో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

గుడిపాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డీకేటీ భూములను ఎలా విక్రయిస్తారని జేసీ విద్యాధరి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గుడిపాల మండలంలోని రఘునాథపురంలో అన్నాతమ్ముడి భూ తగాదాపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ నిమిత్తం గ్రామానికి జేసీ వచ్చారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ.. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటూ.. ఎవరి భూముల్ని ఎవరు విక్రయిస్తారని ప్రశ్నించారు. డీకేటీ భూములను అనుభవించుకోవడం వరకు తప్ప, విక్రయించడానికి అనుమతి లేదన్నారు. ఇద్దరి భూముల్ని రద్దు చేసి, స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రాజారామ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

'సూర్య ఘర్' లక్ష్యాలను అధిగమించాలి : ఎస్ఈ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్య ఘర్ పథకం లక్ష్యాలను అధిగమించాలని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. మంగళవారం గిరింపేటలోని ఎస్ఈ కార్యాలయంలో అధికారులు, వెండార్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు సూర్యఘర్ పథకానికి రెండువేల దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో 156 పూర్తవగా, 186 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. దరఖాస్తులు వచ్చినంత త్వరగా పనులు జరగడం లేదన్నారు. విద్యుత్ శాఖ అధికారులు, వెండార్లు కలిసి సమన్వయంతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ పథకంపై వినియోగదారులకు కూడా అవగాహన కల్పించాలని చెప్పారు. వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడానికి అధికారులు కృషి చేయాలన్నారు. సబ్‌స్టేషన్లను తరచూ తనిఖీలు చేసి, సమస్యను గుర్తిస్తే వెంటనే పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. ఈఈలు మునిచంద్ర, సురేష్, డీఈలు ప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రభుత్వ దృష్టి


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఆంజినేయరెడ్డి

రామకుప్పం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో నియోజకవర్గంలోని గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మండల జనసేన అధ్యక్షుడు హరీష్‌లు తెలిపారు. రామనగర్‌కాలనీలో మంగళవారం వారు సిమెంటు రోడ్ల నిర్మాణపు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. కూటమి అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగుపై దృష్టి సారించాలరాన్నరు. ఈక్రమంలోనే సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో పద్మనాభరెడ్డి, నేతలు విజయ్‌కుమార్, నియాజ్, బాలరాజు, అవినాశ్‌రెడ్డి, సుబ్రీ, షహీన్‌షా, గంగాధర్, మహేష్, చరణ్‌లు పాల్గొన్నారు.

ఆక్రమణల చెర నుంచి చెరువును కాపాడండి


సదస్సులో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): 89పెద్దూరు, ముద్దనపల్లె గ్రామాల్లో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఆవులకుప్పం చెరువును ఆక్రమణల బారి నుంచి కాపాడాలని పలువురు రైతులు తహశీల్దారుకు వినతి పత్రం అందించారు. భూముల రీసర్వే పొరబాట్లపై కొందరు వినతిపత్రాలు అందజేశారు. మండల టీడీపీఅధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, తహశీల్దారు బాబు,డీటీ బాలాజీ, ఆర్ఐ నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి



పలమనేరు, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీకళాశాలల అధ్యక్షుడు రాఘవరెడ్డిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశులు, అధ్యాపకులు సన్మానించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో రాఘవరెడ్డి మాట్లాడుతూ కళాశాల అధ్యాపకుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అతిథి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తానన్నారు. జీసీటీఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వాసు, అధ్యాపకులు డాక్టర్. చిదంబరం, డాక్టర్. నందీశ్వరయ్య అధ్యాపకులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



సోమల, డిసెంబరు 17: వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి కష్టపడి ఇష్టపడి చదవాలని ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు ప్రభుత్వ కళాశాల విద్యార్థులను కోరారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొల్లా కోటీశ్వరరావు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షా సమయంలో ఒత్తిడికి గురికాకూడదన్నారు. సెల్‌ఫోన్ వినియోగం మానుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ అధికారి గౌతం, అధ్యాపకులు రామకృష్ణ, శివయ్య, నాగరత్న, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

అసెస్మెంట్ పరీక్షల పర్యవేక్షణ


పరీక్షల తీరును పర్యవేక్షిస్తున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన అసెస్మెంట్ పరీక్షలను ఎంఈఓ లీలారాణి పర్యవేక్షించారు. ఫిజికల్‌సైన్స్, జనరల్‌సైన్సు పరీక్షలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాస, నైపుణ్యసముపార్జన విద్యావిషయక విజయానికి మూల్యాంకనం చేయడానికి ప్రభుత్వం ఈ పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. 19వ తేదీ వరకు జరుగుతాయన్నారు. సీఆర్‌పీ రంజిత్‌కూడా ఉన్నారు.

షికారీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం


ట్యాంకు ప్రారంభిస్తున్న కమిషనర్, కౌన్సిలర్ తదితరులు

కుప్పం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):స్థానిక షికారీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కాలనీలో తాగునీటి సమస్యపై స్థానికులతోపాటు కౌన్సిలర్లతోపాటు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు గతంలో విన్నవించారు. దీంతో కాలనీలో తాగునీటి సింథటిక్ ట్యాంకు ఏర్పాటు చేశారు. మంగళవారం దానాని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, నాయకులు సత్యేంద్రశేఖర్, వేలు, సుబ్రహ్మణ్యం, రవి, మొగల్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు


అర్జీదారుతో మాట్లాడుతున్న చల్లాబాబు

రొంపిచెర్ల,డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కరించడానికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెవెన్యూ సదస్సులను ప్రవేశపెట్టారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం బొమ్మయ్యగారిపల్లె పాఠశాల వద్ద జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో భూవివాదాలు ఎక్కువయ్యాయన్నారు. 26 వినతులను అధికారులు స్వీకరించారు. కురబకుల కార్పోరేషన్ డైరెక్టర్ రమణ, తహసీల్దార్ కిరణ్‌కుమార్, లోకేష్, శ్రీనివాసులు, మహేష్ పాల్గొన్నారు.

రెండు దేవాలయాల హుండీ ఆదాయం రూ.1.05లక్షలు

పుంగనూరు రూరల్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని రెండు దేవాలయాల హుండీల ద్వారా ఆదాయం రూ. 1.05 లక్షల ఆదాయం లభించింది. ఆలయాల ఈవో కమలాకర్ ఈ విషయం తెలిపారు. మంగళవారంభోగనంజుండేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కించగా రూ.58,868 వచ్చిందన్నారు. అలాగే కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కించగా రూ. 46,635 ఆదాయం సమకూరినట్లు వివరించారు.

మృత్యుంజయేశ్వరుడి హుండీ ఆదాయం రూ.37వేలు

చౌడేపల్లె, డిసెంబరు17:(ఆంధ్రజ్యోతి): స్థానిక అభీష్ట మృత్యుంజయేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.37వేలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కమలాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలుకు సంబంధించి భక్తులు స్వామివారికి హుండీలో 37,762 సమర్పించినట్లు తెలిపారు. ఈ ఆదాయాన్ని పుంగనూరు ఇండియన్ బ్యాంకులో డిపాజిట్ చేశామన్నారు. కార్యక్రమంలో టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, సిబ్బంది హరి పాల్గొన్నారు.

ఏకలవ్యకాలనీ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేణుగోపాల్, కె.శివారెడ్డి తదితరులు

పలమనేరు, డిసెంబరు17 : పలమనేరు బాలాజీ రచించిన ఎరుకల కథాసంపుటి ఏకలవ్యకాలనీ పుస్తకాన్ని మంగళవారం హైదరాబాద్‌లో ఎన్.వేణుగోపాల్ ఆవిష్కరించారు. పుస్తక ప్రతిని కేంద్రసాహిత్యఅకాడమీ అవార్డు గ్రహీత కే.శివారెడ్డికిఆయన అందజేశారు.ఈ సందర్భంగా జరిగిన సభలో స్కైబాబా , కృపాకర్ మాదిగ, జుపాక సుభద్ర, తాయమ్మకరుణ, సమ్మెట ఉమాదేవి, దాట్లదేవదానంరాజు, సుంకోజిదేవేంద్రాచారి, ఇంద్రవల్లిరమేష్, ఎంబీ రామిరెడ్డి, మెర్సిమార్గరేట్, ఆర్.కే, ఆర్డీసీ జి.శ్రీనివాస, వాసిరెడ్డినవీన్, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే పురస్కారాలకు దరఖాస్తులు

గంగవరం,డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): సావిత్రీబాయి పూలే జయంతి పురస్కారాలకు ఆసక్తి గలవారు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు ఓ ప్రకటనలో కోరారు. వివిధ సేవారంగాల్లో రాణిస్తున్న తులసీనాథం నాయుడు, కళామందిరం, గంగవరం, చిత్తూరు జిల్లా అనే చిరునామాకు నేరుగా లేదా పోస్టు ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు.

సారా ఊట ధ్వంసం



పుంగనూరు రూరల్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): సారా తయారీకి సిద్ధం చేసిన 2400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్‌సీఐ సురేంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం పత్రపల్లెతాండా సమీప పొలాల్లో దాడులు నిర్వహించామన్నారు. బెల్లం ఊట నిల్వల డ్రమ్ములను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దాడుల్లో పలమనేరు, పుంగనూరు ఎక్సైజ్ ఎస్ ఐలు, సతీశ్, వేణుగోపాల్‌రెడ్డి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

భువనేశ్వరికి పార్టీ శ్రేణుల స్వాగత సన్నాహాలు


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

శాంతిపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి)ః సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరీ ఈనెల 21న శాంతిపురం, మొరసనపల్లెగ్రామాల్లో మహిళలు, గ్రామస్థులతో సమావేశం కానున్నారు. స్థానిక టీడీపీ నేతలు మంగళవారం ఈవిషయం తెలిపారు. ఆమెకు ఘనస్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నారు. ఆమె సమావేశం కానున్న నందింగం కల్యాణ మంటపాన్ని డీఎస్పీ పార్థసారథి, గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్‌లు పరిశీలించారు. ఏర్పాట్లపై టీడీపీ నేతలకు సూచనలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, నేతలు రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రీతిచామనూరులో పొలంబడి


పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయాధికారులు,రైతులు

శాంతిపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి)ః శాంతిపురం మండలం ప్రీతిచామనూరులో మంగళవారం వ్యవసాయాధికారి అప్పోజి ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయనతోపాటు సిబ్బంది పొలాలను సందర్శించారు. కంది, అనప, మొక్కజొన్న పంటల్లో సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈనెల 31లోగా రైతులు ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా చేయించుకోవాలని వ్యవసాయాధికారి కోరారు.

అడుగంటుతున్న అన్నదాత ఆశలు



నీటిచుక్క కరవైన బైరెడ్డిపల్లె పెద్దచెరువు- కడపనత్తం చెరువు

బైరెడ్డిపల్లె మండలంలో వర్షాభావ పరిస్థితులకు దర్పణం పడుతున్నాయి ఈ రెండు చెరువులు. ఇటీవల కొన్ని మండలాల్లో కొద్దోగొప్పో వర్షపాతం నమోదయింది. చెరువులు, కుంటల్లో నీరుచేరింది. బైరెడ్డిపల్లె మండలంలో మాత్రం పెద్దగా వర్షం కురవలేదు. ముసురు, తుంపర్లకే పరిమితమైంది. దీంతో చెరువులు అడుగంటిపోయాయి. భూగర్భ జలాలు పాతాళానికి చేరడంతో బోర్లతో సాగు చేయడానికి రైతులు నానాతంటాలు పడుతున్నారు. సాగునీరు లేక కొందరు రైతులు తమ భూములను బీడుగా వదిలేశారు. వర్షంపై ఆధారపడిన రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో రక్షితబోర్లలో కూడా క్రమేణా నీరు అడుగంటిపోతోంది. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరుణుడు కరుణించి చెరువులకు నీరుచేరాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. -బైరెడ్డిపల్లె (ఆంధ్రజ్యోతి)

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై అర్జీలు


గడ్డంవారిపల్లెలో జరిగిన సదస్సులో రైతులు, అధికారులు

పుంగనూరు రూరల్ డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాము కోరారు. మంగళవారం రాగానిపల్లె పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీ- సర్వే ఇబ్బందులపై రైతులు వినతిపత్రాలు అందజేశారు. 19 అర్జీలురాగా మూడింటిని పరిష్కరించినట్లు తహసీల్దార్ తెలిపారు. **సోమల:** పలు ఎస్టీ కాలనీ వాసులకు శ్మశానాలకు స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపీపీ ప్రభాకర్ తెలిపారు. సూరయ్యగారిపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో కరకమంద పసలమంద ఎస్టీలకు ప్రభుత్వం కేటాయించిన భూముల వద్దకు దారి సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. బూడిదేటివారిపల్లె, ఎర్రంవారిపల్లెల్లో శ్మశానాలకు భూమి కేటాయించాలని ఎస్సీలు కోరారు. తహసీల్దార్ బెన్నురాజ్, సర్పంచు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. **కల్లూరు:** అయ్యావాండ్లపల్లి సచివాలయంలో తహశీల్దార్ జయసింహ గ్రామసభను నిర్వహించారు. ప్రజలు నుంచి వచ్చిన 27 అర్జీలను పరిష్కరిస్తామన్నారు.

చౌడేపల్లె: గడ్డంవారిపల్లెలో జరిగిన సదస్సులో సర్వేలు, భూసమస్యలపై 30 అర్జిలు అందినట్లు డీటీ మాధవి పేర్కొన్నారు. టీడీపీ నాయకుడు వెంకటరమణ ఆర్ఐ భారతి, పాల్గొన్నారు.

ప్రభుత్వ దృష్టికి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు


సీనియర్ విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘ నాయకులు

పుంగనూరు రూరల్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేయనున్నట్లు ఆ సంఘ పట్టణ అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో సీనియర్ విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. **కుప్పం**: నియోజకవర్గ అభివృద్ధిలో పెన్షనర్లు భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ కంచర్ల పిలుపునిచ్చారు. ఎన్జీవో హోమ్‌లోపెన్షనర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవం జరిగింది. ఎమ్మెల్సీ మాట్లాడుతూ పెన్షనర్ల భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. పెన్షనర్ల సంక్షేమ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీజీ.సెల్వం, కె.గణేశ్ పిళ్లై పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల సారథులకు సత్కారం



కుప్పం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెద్దవంక, బ్రహ్మదేవరచేన్లు గ్రామాలలో సాగునీటి సంఘాలకు ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులను మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ చెరువులను రైతులకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయడంలో అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, క్లస్టర్ ఇన్‌చార్జి సత్యేంద్రశేఖర్, ఏపీ.రవి పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిపై ముగిసిన శిక్షణ తరగతులు


శిక్షణాతరగతుల్లో పాల్గొన్న సిబ్బందితో రెడ్డెప్ప, అధికారులు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణాతరగతులు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి బైరెడ్డిపల్లె ఎంపీపీ రెడ్డెప్ప ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి రెండు రోజుల శిక్షణలో వివరించారు. అభివృద్ధికి సంబంధించి నిర్దేశించిన తొమ్మిది లక్ష్యాల గురించి ఎంపీడీవో రాజేంద్రబాలాజీ వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ లోకనాథం, వ్యవసాయాధికారి గీతాకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఏపీవో హరినాథ్, వెలుగు ఏపీఎం లలిత, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, రిసోర్స్‌పర్సన్ సురేష్ పాల్గొన్నారు.

చౌడేపల్లె: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు,వివిధ శాఖల అధికారులకు 17 అంశాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి, కృష్ణవేణి పాల్గొన్నారు.


సమష్టి నిర్ణయాలతో గ్రామాల అభివృద్ధి

రామకుప్పం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి)ః ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు సమష్టి నిర్ణయాలతో గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌లు కోరారు. మంగళవారం సాయంత్రం మండల పరిధి 89పెద్దూరులో వారు స్థానిక అధికారులు, నేతల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి కార్యక్రమం ప్రజలందరికీ పదికాలాల పాటు సౌకర్యంగా ఉండేలా చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమణ, నేతలు కామరాజనాయక్, మనోహర్, గజేంద్ర, లోకేశ్, కదిరప్ప, రమేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు,రేపు విద్యుత్ అంతరాయం కలిగితే సహకరించాలి

పుంగనూరు రూరల్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయం కలిగితే ప్రజలు సహకరించాలని విద్యుత్ డీఈఈ శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పలమనేరు 132 కేవీ పరిధిలో చిన్నపాటి సాంకేతిక మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో బుధ,గురువారాల్లో పుంగనూరు డివిజన్‌కు మదనపల్లె 220 కేవీ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. సరఫరాలో అంతరాయం వస్తే సహకరించాలని ప్రజలకు కోరారు.

ఆరోగ్య ఉపకేంద్రాల తనిఖీ


తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు

సోమల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పలు ఆరోగ్య ఉపకేంద్రాలను జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. చిన్నఉప్పరపల్లె ఆరోగ్యకేంద్రంలోని రికార్డులను పరిశీలించి నిధుల మంజూరు, మాతా శిశుసంరక్షణ కార్యక్రమాల అమలు, గర్భవతులకు, యుక్త వయసు బాలికలకు నిర్వహించే పరీక్షలపై ఆరా తీశారు. ఉద్యోగుల పనితీరు పలు అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి జార్జి, ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం అధికారి రాంమోహన్, పీఎంఎంవీవై అధికారి మంజునాథ్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయసింహ, అమరనాథ్ పాల్గొన్నారు.

దాడిలో ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో ఇరువర్గాలు దాడులకు పాల్పడిన సంఘటనలో ఓ యువకుడు గాయపడ్డాడు వివరాలు...ఏటవాకిలిలో ఇటీవల జరిగిన సాగునీటి సంఘ ఎన్నికల్లో రెడ్డెప్ప గెలుపొందాడు. అయితే గ్రామానికి చెందిన వాసుదేవప్ప ఓటు హక్కు లేక పోటీ చేయలేకపోయాడు. దీంతో ఇరువురి మధ్య స్పర్థలేర్పడ్డాయి. ఈక్రమంలో మంగళవారం ఇరువురి కుమారులు ఘర్షణ పడ్డారు. రెడ్డెప్ప కుమారుడు మహేంద్ర గాయపడ్డాడు.

ఘనంగా సోమేశ్వరస్వామి కల్యాణోత్సం



పుంగనూరు, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగిరివీధిలో సోమేశ్వరస్వామికి సోమవారం రాత్రి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం కల్యాణోత్సం నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

పైప్‌లైన్ లీకేజీతో ఇబ్బందులు

రామకుప్పం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకు పైపులైన్ పగిలి నెలలు కావస్తున్నా పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ దెబ్బతిని లీకేజీ అవుతున్న చోట చెత్తాచెదారం పేరుకుపోయింది. దుర్గంధం వెదజల్లుతోంది. ఇలాగే వదిలేస్తే నీరు కలుషితమయ్యే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పైపులైను మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి శిక్షణా తరగతులు దోహదం

సోమల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఏడీఏ శివకుమార్ రాజ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సచివాలయ, కార్యదర్శుల శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారం విషయంలో శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. ప్రజాప్రతినిధులతో కలసి క్షేత్రస్థాయి సందర్శనల ద్వారా సమస్యలను పరిష్కరించవచ్చన్నారు. ఎంపీడీవో నారాయణ, ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, ఏపీవో దినకర్‌బాబు, ఎంపీఎం శివయ్య, సూపర్‌వైజర్ హరిత సర్పంచులు, కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పూతలపట్టు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందారు. తేనేపల్లె పంచాయతీ బాటగంగమ్మ మిట్టూరు గ్రామానికి చెందిన గణపతి రెడ్డి భార్య అనిత (42) మంగళవారం యథావిధిగా పొలం వద్దకు వెళ్లారు. అక్కడ ఓ చెట్టు వద్ద మెడకు చీరకొంగుతో ఉరేసుకుని ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కృష్ణమోహన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకోగా.. ఆమె అప్పటికే మృతిచెందింది. ఈమె మృతిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అసౌకర్యాల చెంత కందూరు వారపుసంత



సోమల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కందూరు మేజర్ పంచాయతీ ప్రతి ఆదివారం జరిగే వారపుసంతతో ఆదాయం వస్తున్నా వసతులను మాత్రం సమకూర్చడంలేదు. పంచాయతీకి ఏటా రూ.5లక్షలు ఆదాయం వస్తుంది. అయినా సంతకు సొంత స్థలం లేదు. ప్రైవేటు వ్యక్తుల స్థలంలో 50 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ఈవారపు సంతకు కలికిరి, నిమ్మనపల్లె, సోమల, సదుం మండలాల నుంచి వచ్చి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుంటారు. వర్షానికి, ఎండకు తలదాచుకోవడానికి ఎటువంటి సౌకర్యాలు లేవు. షెడ్లు కూడా నిర్మించలేకపోతున్నారు. అధికారులు స్పందించి సొంత స్థలం కేటాయించి దుకాణ సముదాయం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. సోమల, నెల్లిమంద, తమ్మినాయనపల్లె, వల్లిగట్ల, కామిరెడ్డివారిపల్లె, కందూరు రైతులు తమ పంటలను సంతకు తీసుకువస్తుంటారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

రైతులకు ప్రభుత్వ విప్ థామస్ సూచన



కార్వేటినగరంలో నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ప్రభుత్వ విప్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సూచించారు. మంగళవారం కార్వేటినగరం మండలం నీడీకండ్రిగలో జరిగిన సదస్సుకు హాజరయ్యారు. వంద అర్జీలు వస్తే.. 80 నుంచి 85 వరకు రెవెన్యూ పరమైనవే ఉన్నాయన్నారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఈ సదస్సులు జరుగుతున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు హాజరయ్యారు.

నీటి సంఘాల అధ్యక్షులకు సన్మానం: వెదురుకుప్పం, పాలసముద్రం, కార్వేటినగరం మండలాల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను మంగళవారం థామస్ సన్మానించారు. కార్వేటినగరం టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

సమస్యల పరిష్కారమే లక్ష్యం: సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని థామస్ అన్నారు. మంగళవారం వెదురుకుప్పం మండలం దేవళంపేటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా, అనారోగ్యంతో ఉన్న యనమలమంద కాలనీకి చెందిన ఎస్సీ సెల్ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మరకాలకుప్పం సుధాకర్‌ను మంగళవారం రాత్రి ఎమ్మెల్యే పరామర్శించారు.

విద్యార్థుల్లో సామర్థ్యం పెంచాలి: ఆర్జేడీ



ఆర్జేడీ శామ్యూల్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న ఎంఈవో సంఘం నాయకులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి పరీక్ష విద్యార్థుల్లో సామర్థ్యం పెంచాలని కడప ఆర్జేడీ శామ్యూల్ సూచించారు. జిల్లాలో జరుగుతున్న సమ్మేటివ్ పరీక్షల్లో భాగంగా మంగళవారం చిత్తూరు, గంగాధరనెల్లూరు మండలాల్లోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు. అనంతరం డీఈవో కార్యాలయానికి వచ్చిన ఆయన్ను ఎంఈవోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సెల్వరాజ్, ఎంఈవోలు మోహన్, హస్సన్ బాషా, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం, జిల్లా నాయకులు మురళి, భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్జేడీ మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణలో టీచర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని హెచ్చరించారు. డీఈవో కార్యాలయంలో పలు అంశాలపై తనిఖీలు కొనసాగిస్తున్నామని చెప్పారు.

సాగునీటి సంఘ అధ్యక్షుడికి ఎమ్మెల్యే సన్మానం



మనోహర్‌నాయుడిని సన్మానించిన ఎమ్మెల్యే భానుప్రకాష్

నింద్ర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కావనూరు సాగునీటి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మనోహర్‌నాయుడిని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సన్మానించారు. ఎమ్మెల్యేని తిరుపతిలోని ఆయన స్వగృహంలో మంగళవారం మనోహర్‌నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరథవాసు, వెంటేశులురెడ్డి, కాటయ్య, మనోజ్ యాదవ్, లింగయ్య, అప్పారావు, ఢిల్లీనాయక్, అభిషేక్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

కొయ్య బొమ్మల తయారీలో దిట్ట కుమార్ ఆచారి



యాదమరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాదమరిలోని కుమార్ ఆచారి కొయ్యలతో పలు బొమ్మలను అద్భుతంగా తయారు చేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నాడు. ప్రధానంగా.. విఘ్నేశ్వరుడు, శ్రీనివాసుడు, గోమాత.. ఇలా పలు బొమ్మలను తయారు చేస్తున్నాడీయన. వేంకటేశ్వర స్వామి వారి విగ్రహాలకు డిమాండ్ ఉండడంతో వీటినే ప్రస్తుతం అధికంగా తయారు చేస్తున్నట్లు కుమార్ తెలిపారు. ఒక బొమ్మ తయారీకి రెండు వారాల సమయం పడుతుందని చెప్పారు. తిరుపతి నుంచి ఆర్డర్లు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి.. బొమ్మల తయారీకి అవసరమైన యంత్రాలు సబ్సిడీపై పంపిణీ చేయాలని కోరుతున్నాడు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



అనిత (ఫైల్ ఫొటో)

పూతలపట్టు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందారు. తేనేపల్లె పంచాయతీ బాటగంగమ్మ మిట్టూరు గ్రామానికి చెందిన గణపతి రెడ్డి భార్య అనిత (42) మంగళవారం యథావిధిగా పొలం వద్దకు వెళ్లారు. అక్కడ ఓ చెట్టు వద్ద మెడకు చీరకొంగుతో ఉరేసుకుని ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కృష్ణమోహన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకోగా.. ఆమె అప్పటికే మృతిచెందింది. ఈమె మృతిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి, మృతదేహానికి పంచనామా నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పెట్రోల్ బంకులో దొంగతనం చేసిన వ్యక్తి అరెస్టు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకులో దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురంలో జనవరి నెలలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో లాకర్లను పగలగొట్టి.. అందులోని రూ.2లక్షల 40వేలను ఎత్తుకెళ్లారు. దీనిపై కేసు నమోదైంది. దర్యాప్తు చేయగా, ప్రకాశం జిల్లా పొదిలి గ్రామానికి చెందిన కంచర్ల వెంకటరావు (40)ను నిందితుడిగా గుర్తించారు. అతడికి అక్కడికెళ్లి పట్టుకుని తీసుకొచ్చి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. ఇతడిపై ఇదివరకే 12 కేసులు ఉన్నాయని, చాలాసార్లు జైలుకు కూడా వెళ్లొచ్చినట్లు గుర్తించామన్నారు.

వివిధ రకాల వేషాల్లో భక్తులు



కార్వేటినగరంలో గంగ జాతర

వెదురుకుప్పం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగ జాతర సందర్భంగా కార్వేటినగరం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. బంగారమ్మ ఆలయానికి పోటెత్తారు.



బంగారమ్మ ఆలయంలో భక్తుల సందడి

నేటినుంచి బాల ఆధార్ కేంద్రాలు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో ఈనెల 18, 19, 20, 26, 27, 28 తేదీల్లో నిర్వహించే బాల ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, సీడీపీవో వినతశ్రీ సూచించారు. ఎంపీడీవో మీటింగ్ హాలులో మంగళవారం హౌసింగ్, ఇళ్ల నిర్మాణపనులు, బాల ఆధార్ నిర్వహణపై ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, అంగన్వాడీ వర్కర్లతో సమీక్షించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఈశ్వర్ ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బిందుమాలతి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి: సీడీపీవో

విజయపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని నగరి సీడీపీవో కృష్ణవేణి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో కిశోర వికాసంపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రమణప్రకాష్, వైద్యాధికారి సోమశేఖర్, ఎస్ఐ బలరాం, అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, ఏపీఎం హరి పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సులకు ఓకే.. ఆర్టీసీకి నో!

ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు



రోడ్డుపై ఆగి ఉన్న ప్రైవేటు బస్సులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇరుకైన రోడ్లతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులకు ప్రైవేటు బస్సుల దందా తలనొప్పిగా మారుతోంది. ఇటు తమిళనాడులోని వేలూరుకు, అటు గుడియాత్తం, పలమనేరు, బెంగళూరుకు వెళ్లడానికి గాంధీ సర్కిల్ సెంటర్ పాయింట్‌గా ఉంది. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడి నుంచి వందలాది మంది బస్సులు ఎక్కుతుంటారు.. దిగుతుంటారు. అంతేకాకుండా ఈ సర్కిల్‌కు చుట్టుపక్కలా పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల, విజయం విద్యాసంస్థలు, ఇతర పాఠశాలలు కూడా ఉన్నాయి. అందువల్ల ఈ ప్రాంతం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో వేలూరు, గుడియాత్తం, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు బస్సులను వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పక్కనే రోడ్లపై ఆపేస్తారు. వెనుక వైపున వచ్చే ఆర్టీసీ బస్సులకు దారి వదలకుండా చేస్తున్నారు. దీనివల్ల ఇటు ప్రయాణికులు, అటు ఇతర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇవన్నీ ఇలా ఉంటే.. ఆర్టీసీ బస్సులను మాత్రం నిలిచిన నిమిషాల్లోనే పంపించేస్తున్న ట్రాఫిక్ పోలీసులు.. ప్రైవేటు బస్సులను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

ప్రతి గ్రామంలోనూ సమస్యలు గుర్తించండి

పూతలపట్టు నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక సమావేశంలో కలెక్టర్, ఎమ్మెల్యే



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలోనూ సమస్యలు గుర్తించాలని అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదేశించారు. మంగళవారం కాణిపాకంలోని ఎల్బీ కల్యాణ మండపంలో పూతపట్టు నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులతో కలసి ప్రతి గ్రామంలోనూ సమస్యలు గుర్తించి, ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పైసాను పారదర్శకంగా వెచ్చించాలన్నారు. నియోజకవర్గంలో అత్యధిక శాతం రైతులు మామిడిపై సాగుపై ఆధారపడి ఉన్నారని, వారిని ప్రత్యామ్నాయ పంటల వైపు మారేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగు చేస్తున్నారని, దీన్ని ఇక్కడి రైతులు పాటించేలా కృషి చేయాలన్నారు. గోకులం షెడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. డెయిరీ నిర్మాణానికి ముందుకు వచ్చే రైతులకు భూమి కేటాయిస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 2047 విజన్‌తో మన గ్రామం ఎలా ఉండాలో ఓ నిర్ధారణకు వచ్చి ప్రణాళికలను మరో మూడు నెలల్లో సిద్ధం చేస్తామన్నారు. నియోజకవర్గాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆశించిన రీతిలో తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ పద్మనాభం, జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పీఆర్ ఏఈలు విజయ్‌కుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో ప్రభావతి, తహసీల్దార్ మహేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో ధనలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, జడ్పీటీసీ సుచిత్ర, నాయకులు హరిబాబునాయుడు, మణినాయుడు, ఎంఎస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ



వెజ్జుపల్లె సదస్సులో ప్రసంగిస్తున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ

గంగాధర నెల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలు పరిష్కరించుకోవడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ అన్నారు. మంగళవారం నందనూరు, వెజ్జుపల్లె గ్రామాల్లో సదస్సులు జరిగాయి. ఆయన మాట్లాడుతూ.. రైతుల కష్టాలను తొలగించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్, వెజ్జుపల్లె సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐ ఏకాంబరం, సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురం: మంగళంలో జరిగిన సదస్సులో తహసీల్దార్ కిరణ్, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పూతలపట్టు: ఎం.బండపల్లెలో జరిగిన సదస్సులో తహసీల్దార్ గురప్ప, డీటీ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: 197 రామాపురంలో జరిగిన సదస్సులో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, డీటీ లక్ష్మి, సర్పంచ్ జనార్దన్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించండి



సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకట్రామిరెడ్డి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలో చేపడుతున్న ఎన్టీఆర్ మన ఇల్లు గృహ నిర్మాణాలను లబ్ధిదారులతో సమన్వయం చేసుకుని, వేగంగా పూర్తి చేయించాలని ఇన్‌చార్జి కమిషనర్, ఎంఈ వెంకట్రామిరెడ్డి ఆదేశించారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో హౌసింగ్, అమినిటీ అధికారులతో సమీక్షించారు. లెంటల్ లెవల్స్ వరకు పూర్తి చేసిన గృహాలను వచ్చే ఏడాది జనవరి 15వ తేదీకల్లా పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ ప్రత్యేకాధికారి హరినాథరెడ్డి, ఈఈ నాయక్, ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం.. ప్రమాదకరం



అగరంపల్లె వద్ద యువకులతో ప్రమాణం చేయిస్తున్న ఎస్ఐ

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం అని కాణిపాకం ఎస్ఐ ధరణీధర అన్నారు. మంగళవారం అగరంపల్లె ఆర్చి వద్ద తన సిబ్బందితో కలసి రోడ్డుపై హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తున్న వారిని పట్టుకుని జరిమానా విధించారు. అనంతరం హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడపమని ప్రమాణం చేయించారు.

విద్యార్థికి అభినందన



నగరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి శివరాజ్ ఇంటర్ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ టోర్నీకి ఎంపికయ్యాడు. మంగళవారం ఈ విద్యార్థిని అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అభినందించారు. ఈనెల 21 నుంచి 29వ తేదీవరకు కేరళ రాష్ట్రంలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.

పేదరిక నిర్మూలనపై దృష్టి పెట్టండి

పెనుమూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అధిగమిస్తే గ్రామాభివృద్ధి సాధించినట్లేనని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో సర్పంచులు, సచివాలయ సిబ్బంది, విద్య, వైద్య శాఖల అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలనపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: హైస్కూల్లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, వెలుగు ఏపీఎం ఫరీద్‌మస్తాన్, ఏఈ ఈశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో అమరనాథ్, ఈవోపీఆర్డీ పురుషోత్తం పాల్గొన్నారు.

అబాకస్‌లో మెరిసిన పీఈఎస్ చిన్నారి



ట్రోఫీలతో రిష్విక్

యాదమరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న రిష్విక్ ఈనెల 14, 15 తేదీల్లో ఢిల్లీలో జరిగిన యూసిమాస్ అబాకస్ ఇంటర్నేషనల్ కాంపిటీషన్‌లో జడ్ కేటగిరీలో జాతీయస్థాయిలో ఐదో స్థానాన్ని, అంతర్జాతీయ స్థాయిలో రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా చిన్నారికి, తల్లిదండ్రులకు పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు అభినందనలు తెలిపారు.

రాజ్యసభ సభ్యులకు సన్మానం



కృష్ణయ్యను సన్మానించిన షణ్ముగం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యులుగా రెండ్రోజుల కిందట ప్రమాణం చేసిన ఆర్.కృష్ణయ్య, మస్తాన్‌రావులను బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం సన్మానించారు. వీరిని మంగళవారం ఢిల్లీలోని పార్లమెంటు భవన్‌లో కలిసి అభినందనలు తెలిపారు.

టీడీపీలోకి ఆళ్లమడుగు సర్పంచ్



వెదురుకుప్పం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు సర్పంచ్ కామసాని నవనీతమ్మ మంగళవారం తెలుగుదేశం పార్టీ గూటికి చేరారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ సమక్షంలో టీడీపీలో చేరారు.

భువనేశ్వరికి టీడీపీ శ్రేణుల స్వాగత సన్నాహాలు

శాంతిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఈనెల 21న శాంతిపురం, మొరసనపల్లెగ్రామాల్లో మహిళలు, గ్రామస్థులతో సమావేశం కానున్నారు. స్థానిక టీడీపీ నేతలు మంగళవారం ఈవిషయం తెలిపారు. ఆమెకు ఘనస్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నారు. ఆమె సమావేశం కానున్న నందింగం కల్యాణ మంటపాన్ని డీఎస్పీ పార్థసారథి, గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్‌లు పరిశీలించారు. ఏర్పాట్లపై టీడీపీ నేతలకు సూచనలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, నేతలు రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం

పుంగనూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సారా తయారీకి సిద్ధం చేసిన 2400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్‌సీఐ సురేంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం పత్రపల్లెతాండా సమీప పొలాల్లో దాడులు నిర్వహించామన్నారు. బెల్లం ఊట నిల్వల డ్రమ్ములను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దాడుల్లో పలమనేరు, పుంగనూరు ఎక్సైజ్ ఎస్ ఐలు, సతీశ్, వేణుగోపాల్‌రెడ్డి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

హోమియోపతి ఆస్పత్రి ఏడాదిగా మూత

సిబ్బంది లేకపోవడమే కారణం!



సిద్దేశ్వరకొండలోని హోమియోపతి ఆస్పత్రి భవనం

గంగాధరనెల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిద్దేశ్వరకొండ గ్రామంలోని హోమియోపతి ఆస్పత్రిలో ఏడాదిగా మూతపడింది. వైద్యుడి పోస్టు.. సుమారు ఆరేళ్లుగా, అటెండర్ పోస్టు.. ఎనిమిదేళ్లుగా, ఫార్మసిస్ట్ పోస్టు.. ఏడాదిగా భర్తీకాక పోవడమే కారణమని సమాచారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఆస్పత్రిని గంగాధరనెల్లూరు పీహెచ్‌సీకి మార్చాలని అప్పటి హోమియోపతి శాఖ కమిషనర్ చూశారు. అలా మార్చొద్దని స్థానికులు, వివిధ పార్టీలకు చెందిన నేతలు డీఎంహెచ్‌వోకు, కర్నూలు ఆర్‌డీడీలకు వినతిపత్రాలను పంపారు. దాంతో ఈ ప్రక్రియ అప్పట్లో ఆగిపోయింది. ప్రస్తుతం ఆస్పత్రి తెరవక పోవడంతో రాత్రయితేమందుబాబులకు నిలయంగా మారుతోంది. ఇకనైనా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే థామస్ అయినా చొరవ చూపి ఈ ఆస్పత్రిని అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

2047 నాటికి స్వర్ణాంధ్రగా ఏపీ: టీడీపీ

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు విడుదల చేసిన డాక్యుమెంట్ ఆధారంగా 2047 నాటికి స్వర్ణాంధ్రగా ఏపీ రూపుదిద్దుకుంటుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను వివరించారు. అన్ని వర్గాలకు ప్రయోజనంతోపాటు రాష్ట్రాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు.

ఒరిగిన టిప్పర్

వెదురుకుప్పం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డస్ట్‌ను తరలిస్తున్న ఓ టిప్పర్ మంగళవారం అదుపు తప్పి కొంత పక్కకు ఒరిగింది. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం సమీపంలోని ఓ క్వారీ నుంచి డస్ట్‌ను కార్వేటినగరం వైపు తీసుకెళుతుండగా గురవరాజుగుంట సమీపంలో పక్కకు ఒరిగింది. ఏ వాహనం రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

కరపత్రాల ఆవిష్కరణ

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి ఆరో తేదీన హైందవ శంఖారావం జరగనుందని సీకే లావణ్య తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను వావిల్ తోట శివాలయంలో మంగళవారం ఆమె ఆవిష్కరించారు. విశ్వహిందూ పరిషత్ నాయకుడు వేలు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ డే

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీవీకేఎన్ కళాశాలలో విశ్రాంత అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్ డే ఘనంగా జరిగింది. ఎస్టీవో మల్లికార్జున్, కార్యాలయ అధికారి భానుప్రసాద్, సంఘం అధ్యక్షుడు హరినాయుడు, టి.గోవిందస్వామి, నరసింహులు శెట్టి, గోపాల్ నాయుడు పాల్గొన్నారు. అలాగే పెన్షనర్ల భవనంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు నాగరాజ, కృష్ణమనాయుడు, మునిరత్నం రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు టీబీపై అవగాహన

నగరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుండ్రాజకుప్పం పంచాయతీ పరిధిలోని స్టోన్ క్రషింగ్‌లో పనిచేస్తున్న కార్మికులకు టీబీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది డాక్టర్ రమేష్, కీర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బ్రీత్ సేఫ్ 360 టీబీ అలర్ట్ ఇండియా వారి సహకారంతో ఈ క్యాంపు నిర్వహించారు.

స్మార్ట్ తాళాల వినియోగంపై అవగాహన

నగరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు స్మార్ట్ తాళాల వినియోగంపై సీఐ మహేశ్వర్ అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎంపీడీవో సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించండి

పాలసముద్రం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి ఆదేశించారు. ఉపాధి హామీ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ బృందంలోని డీఆర్పీలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 13 పంచాయతీల్లో రూ.5 కోట్లతో 814 పనులను కూలీలు చేశారన్నారు. ఎక్కడైనా అవకతవకలుంటే తెలియజేయాలని ప్రజలకు సూచించారు. సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ మల్లికార్జున్, ఏపీవో మార్గరేట్, ఈసీ అనూషా పాల్గొన్నారు.

11 మందికి జరిమానా

చిత్తూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందికి జరిమానా విధించారు. ట్రాఫిక్ పోలీసులు సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేశారు. 11 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడగా మంగళవారం వీరిని న్యాయమూర్తి ఉమాదేవి ముందు హాజరు పరిచారు. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

పాలసముద్రం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగమాంబాపురం సెల్ టవర్ వద్ద సారా విక్రయిస్తున్న నవీన్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. నరసింహాపురం గ్రామానికి చెందిన నవీన్.. గంగామాంబాపురంలో సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 8 లీటర్ల సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు పంపారు.